# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల బృందాలు ఈరోజు కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యాయి.
- కృష్ణా, గోదావరి జలాలు, బనకచర్ల ప్రాజెక్ట్ పై కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ప్రయాణికుల గోప్యతకు భంగం కలిగించకుండా సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు రైలు బోగీలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ వెల్లడించారు.

==============================

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్ ఈరోజు న్యూఢిల్లీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటూ రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖా మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర జల శక్తి కార్యాలయంలో దాదాపు గంటన్నర పాటూ ఈ సమావేశం జరిగింది. అనంతరం ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమయ్యారు.

==============================

కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఈరోజు జరిగిన చర్చలు సామరస్యపూర్వక వాతావరణంలో సాగాయని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆ వివరాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడిస్తూ.... శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులపై ముఖ్యమంత్రులిద్దరూ చర్చించారని తెలిపారు. ఇరు రాష్ట్రాలు ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్ర జలశక్తి శాఖా మంత్రి పరిగణనలోకి తీసుకున్నారని తెలిపారు.

రిజర్వాయర్ల నుంచి కాలువలకు వెళ్ళే చోట టెలీమెట్రీలను ఏర్పాటు చేయడానికి అంగీకరించారని తెలియజేశారు. కృష్ణా, గోదావరి జలాలు, బనకచర్లపై కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారని నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పరిధిలో ఇళ్ళు లేని 2 వేల మందికి ఆగస్టులో శాశ్వత ఇళ్ల పట్టాలను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఆ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈరోజు అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గతంలో 3 వేల మందికి సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ఇళ్లపట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2 వేల పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల స్థల సేకరణకు కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

==============================

ప్రయాణీకుల భద్రత దృష్ట్యా ప్యాసింజర్ కోచ్‌లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల ప్రయాణీకుల భద్రత పెరగడంతో పాటు దొంగతనాలు తగ్గే అవకాశం ఉందని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ తెలిపారు. విజయవాడ రైల్వే లోకో షెడ్ లోని రైలు బోగీలలో కెమెరాల ఏర్పాటు ప్రక్రియను ఆయన ఈరోజు పర్యవేక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... రైలు కోచ్‌లోని ప్రతి ప్రవేశ మార్గంలో రెండు చొప్పున మొత్తం 4 డోమ్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రయాణికుల గోప్యతకు భంగం కలిగించకుండా సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు ఈ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని డీఆర్ఎం వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

==============================

పొగాకు వల్ల ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల ప్రచార కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఆరోగ్యానికి హాని కలిగించే దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సిగరెట్, బీడి, చుట్ట, ఖైనీ, గుట్కా మొదలగు పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ఎంతో మంది క్యాన్సర్ మొదలగు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, అందుచేత వీటిని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

==============================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య శిక్షణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్టణంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో ఈరోజు మెగా జాబ్ మేళాను నిర్వహించారు. మొత్తం 30 బహుళ జాతీయ సంస్థలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనగా 2 వేల 300 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పాత్రికేయులతో మాట్లాడుతూ... చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి 6 నెలలకు ఒకసారి

మెగా జాబ్ మేళాలు, ప్రతినెల నియోజకవర్గ స్థాయిలో మినీ జాబ్ మేళాలు నిర్వహించడానికి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ కార్యాచరణ రూపొందించారని కొల్లు రవీంద్ర వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఈరోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా నల్లరాళ్లపల్లి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులతో ఆయన నేరుగా సంభాషించారు.

==============================

భారత్, ఇంగ్లాండ్ మహిళా జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల ఒన్ డే సిరీస్‌లో భాగంగా ఈరోజు సౌథాంప్టన్ వేదికగా తొలి మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ 6 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. అదే విధంగా కోస్తాంధ్రలో వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================
==============================